సాక్షి
వైఎస్ఆర్ జిల్లా

మంగళవారం । 10 । జనవరి । 2023



నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పనే సీఎం ధ్యేయం

నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించడమే సీఎం వైఎస్ జగన్ ధ్యేయమని ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి అన్నారు. - 8లో



ఆధిక్యంలో ఆంధ్రా జట్టు

కడప నగరం వైఎస్ రాజారెడ్డి-ఏసీఏ క్రికెట్ మైదానంలో నిర్వహిస్తున్న అంతర్ రాష్ట్రాల అండర్-25 క్రికెట్ మ్యాచ్‌లో ఆంధ్రా జట్టు ఆధిక్యంలో కొనసాగుతోంది. - 8లో

గరిష్టం/కనిష్టం
30.7 /11.6

వాతావరణం

జిల్లాలో సోమవారం 11.6 – 30.7 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 2.7 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.
– కడప అగ్రికల్చర్



కడప ఎన్జీఆర్ సర్కిల్ సమీపంలో నివాసం ఉంటున్న వెంకటేష్ కార్పెంటర్ పనులు చేసుకుంటూ జీవిస్తున్నారు. రెండేళ్ల కుమారుడు కార్తికేయ పుట్టినప్పటి నుంచి వినికిడి లేకపోవడం, పెరిగేకొద్ది మాటలు రాకపోవడం గ్రహించారు. వైద్యులను సంప్రదిస్తే క్లాకియర్ ఇంప్లాంట్ సర్జరీ చేయాలని సూచించారు. ఆ ఆపరేషన్ చేయించుకునే ఆర్థిక శక్తి లేకపోవడంతో కుటుంబం కుమిలిపోయింది. ఆరోగ్యశ్రీలోకి క్లాకియర్ ఇంప్లాంట్ సర్జరీ చేర్చారని తెలుసుకొని కడప తిరుమల హాస్పిటల్‌లో సంప్రదించారు. ఆరోగ్యశ్రీ ద్వారా సర్జరీ చేయడంతో బాలుడికి ఇప్పుడిప్పుడే మాటలు వస్తున్నాయి. ఆ కుటుంబం ఆనందానికి అవధుల్లేవు. లక్షలు వెచ్చించి సర్జరీ చేయించే శక్తిలేదని, మాకు సీఎం వైఎస్ జగన్ ఆరోగ్య ప్రదాతగా నిలిచారని, జీవితాంతం రుణపడి ఉంటామని వెంకటేష్ చెబుతున్నారు.



ఈ ఫొటోలోని వ్యక్తిపేరు ఖాజాపీర్. కడప నకాశ్‌కు చెందిన ఖాజాపీర్ కూల్ డ్రింక్ షాపు నిర్వహిస్తూ జీవనం సాగిస్తున్నాడు. కొంత కాలంగా గుండె జబ్బుతో బాధపడుతున్నాడు. డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ ద్వారా కడప హోలిస్టిక్ ఆస్పత్రిలో ఒక్క రూపాయి ఖర్చు లేకుండా బైపాస్ సర్జరీ చేయించుకున్నారు. ఇప్పుడు ఖాజాపీర్ తన పనులు తాను చక్కగా కొనసాగిస్తున్నారు. ఆర్థికంగా అంతంత మాత్రంగా ఉన్న తనకు ఆరోగ్యశ్రీ పథకం మళ్లీ పునర్జన్మ ఇచ్చిందని సీఎం వైఎస్ జగన్ సాయం మరువలేనిదని చెప్పుకొస్తున్నాడు.



ఈ ఫొటోలోని యువకుడి పేరు ప్రభాకర్, కమలాపురం మండలం పెద్దచెప్పలి గ్రామస్తుడు. బ్లడ్ ఇన్ఫెక్షన్‌తో పలు రకాల ఆరోగ్య సమస్యలు తలెత్తేవి. 2020లో కరోనా సమయంలో ఓ వైద్యుడి సలహా మేరకు హైదరాబాదు లక్డీకపూల్‌లోని ఎంఎంఎస్‌జె ఆసుపత్రిలో ఆరోగ్యశ్రీ ద్వారా వైద్యం చేయించుకున్నారు. ప్రస్తుతం తిరుపతి స్విమ్స్ ఆసుపత్రిలో చెకప్ చేయించుకుంటూ ఇంటివద్ద విశ్రాంతి తీసుకుంటున్నారు. విశ్రాంతి సమయానికి కూడా ప్రభుత్వం 'ఆరోగ్య ఆసరా' కింద ఆర్థిక సహాయం అందిస్తోంది. ప్రస్తుతం ఆరోగ్యంగా తిరుగుతూ కూలి పనులకు కూడా వెళ్తున్నారు. జీవితం మీద విరక్తి చెందిన నాకు ఆరోగ్యశ్రీ పథకం నా పాలిట దైవంగా మారిందని, జగనన్న ప్రభుత్వానికి శతకోటి ధన్యవాదాలని ప్రభాకర్ పేర్కొంటున్నారు.

ఆరోగ్య శ్రీ మస్తు

- పేదల పాలిట సంజీవని.. డాక్టర్ వైఎస్ఆర్ ఆరోగ్యశ్రీ
- ఆరోగ్యశ్రీ పరిధిలో అత్యధికంగా 3,255 వ్యాధులకు వైద్య చికిత్సలు
- జిల్లాలో 2,31,937 మందికి రూ.499.18 కోట్లు వెచ్చించిన రాష్ట్ర ప్రభుత్వం
- ఆపరేషన్ చేయించుకున్న వారికి ఆర్థిక బలాన్నిస్తున్న 'వైఎస్ఆర్ ఆరోగ్యశ్రీ ఆసరా'
- ఆరోగ్య ఆసరా ద్వారా 99,608 మంది రోగులకు రూ.56.43 కోట్లు



సాక్షి ప్రతినిధి, కడప : డాక్టర్ వైఎస్ఆర్ ఆరోగ్యశ్రీ సేవలు పేదల పాలిట సంజీవనిగా మారాయి. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన ఆరోగ్యశ్రీ పథకం సామాన్య ప్రజల జీవితాలకు మరింత భరోసా కల్పించింది. అనారోగ్యం బారిన పడ్డవారికి, వారి వైద్యానికి అయ్యే ఖర్చును భరించడమే కాకుండా, వారు పూర్తిగా కోలుకొనే వరకూ ఆరోగ్య ఆసరానిస్తూ, దేశంలోని ఇతర రాష్ట్రాలకు సైతం ఆదర్శంగా నిలుస్తోంది. గడిచిన మూడున్నరేళ్ల కాలంలో 2,31,937 మందికి ఆరోగ్యశ్రీ ద్వారా రూ.499.18 కోట్లు వెచ్చించింది.

ఆధునిక వైద్యసేవలు సైతం..

కోవిడ్ –19 వైరస్ బాధితులకు బ్లాక్ ఫంగస్ వ్యాధితో సహా, పలు రకాల కేన్సర్, కిడ్నీ సంబంధిత ఇతర వ్యాధులతో కలిపి ప్రస్తుతం 3,255 వ్యాధులకు రాష్ట్ర ప్రభుత్వం ఆరోగ్యశ్రీ ద్వారా వైద్య సేవలను ఉచితంగా అందిస్తోంది. స్థానిక, ఇతర జిల్లాల్లోనే కాకుండా, మెట్రోసిటీలు హైదరాబాద్, చెన్నై, బెంగళూరులలో కూడా ఆరోగ్యశ్రీ ద్వారా చికిత్స పొందే అవకాశాన్ని రాష్ట్ర ప్రభుత్వం పేదప్రజలకు కల్పించడం సంతోషించదగ్గ విషయంగా పలువురు చెబుతున్నారు. ఆరోగ్యశ్రీ ద్వారా ఏడాదికి కుటుంబానికి వైద్యానికి అయ్యే ఖర్చు గరిష్ట పరిమితిని రాష్ట్ర ప్రభుత్వం రూ.2.50 లక్షల నుంచి రూ.5 లక్షలకు పెంచడం విశేషం. దేశంలోనే మొదటిసారిగా కోవిడ్ చికిత్సను ఆరోగ్యశ్రీలో చేర్చిన ఘనత రాష్ట్ర ప్రభుత్వానిదే. అత్యంత ఖరీదైన బ్లాక్ ఫంగస్ చికిత్స చేర్చడం ఎంతోమందికి అండగా నిలుస్తోంది. ఆరోగ్యశ్రీ పథకం ద్వారా వైఎస్ఆర్ జిల్లాలో ఇప్పటివరకు 2,31,937 చికిత్సలకుగాను రూ.499.18 కోట్లు ఖర్చుచేసింది. వార్షిక ఆదాయం రూ.5 లక్షల లోపు ఉన్న ప్రతి ఒక్కరికీ రాష్ట్ర ప్రభుత్వం ఈ పథకాన్ని వర్తింపజేస్తుండటం గర్వకారణమని పలువురు వెల్లడిస్తున్నారు.

వైద్యరంగానికి పెద్దపీట..

వైద్యరంగానికి అత్యంత ప్రాధాన్యతనిస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన ఏడాదిలోనే 1,088 కొత్త అంబులెన్సులను కొనుగోలు చేసి, ప్రతి మండలానికి 108, 104 వాహనాలు అందుబాటులో ఉంచారు. నాడు–నేడు పథకం ద్వారా ఆస్పత్రుల అభివృద్ధికి కోట్లాది రూపాయలు ఖర్చు చేస్తున్నారు. తాజాగా రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఫ్యామిలీ డాక్టర్ల కాన్సెప్ట్ ట్రయల్ రన్ కార్యక్రమం జిల్లాలో సత్ఫలితాలను ఇస్తుండడం విశేషం. జిల్లా వ్యాప్తంగా 88 ప్రభుత్వాస్పత్రులతో పాటు 36 కార్పొరేట్ ఆసుపత్రుల్లో ఆరోగ్యశ్రీ వైద్యసేవలు అందుతున్నాయి.

ఆర్థిక బలాన్నిస్తున్న 'ఆరోగ్య ఆసరా'..

నవరత్నాల్లో భాగంగా 'డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ' కింద చికిత్స పొందిన రోగులకు 'వైఎస్సార్ ఆసరా' పథకం వర్తింప చేస్తున్నారు. ఈ పథకం కింద పేషెంటు చికిత్స అనుసరించి అతడి విశ్రాంతి కాలంలో రోజుకు రూ.225 చొప్పున గరిష్టంగా నెలకు రూ.5,000 ఇస్తున్నారు. శస్త్ర చికిత్స పూర్తయిన తరువాత డిశ్చార్జ్ అయిన రోగులకు అదే రోజునే 'వైఎస్సార్ ఆరోగ్య ఆసరా' లబ్ధి మొత్తాన్ని వారి బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తున్నారు. ఈ పథకం 1,500 పైగా చికిత్సలకు వర్తింప చేస్తున్నారు. ఆరోగ్య ఆసరా ద్వారా ఇప్పటి వరకూ జిల్లాలో 99,608 మంది రోగులకు రూ.56.43 కోట్లు వెచ్చించారు. మునుపెన్నడూ ఇలాంటి పథకం లేదు.

అద్భుతమైన ఘట్టం 'ఆరోగ్యశ్రీ ఆసరా' - విజయరామరాజు, జిల్లా కలెక్టర్



ఆరోగ్యశ్రీ పరిధిలో గతంలో ఉన్న వ్యాధుల జాబితాతో పాటు అదనంగా మరిన్ని వ్యాధులను చేర్చి మొత్తంగా 3,255 వ్యాధులకు వైద్యసేవలు అందిస్తున్నారు. డాక్టర్ వైఎస్ఆర్ ఆరోగ్యశ్రీ పథకంలో మరో అద్భుతమైన ఘట్టం 'ఆరోగ్యశ్రీ ఆసరా'. పేదలు ఏదైనా అనారోగ్య కారణంతో ఆస్పత్రి పాలైతే ఆర్థికంగా వారి జీవితం మరింత దుర్భరం అవుతుంది. అదే ఇంటి పెద్ద అయితే కుటుంబం మొత్తం కష్టాల పాలవుతుంది. ఇలాంటి వారి జీవనోపాధికి ఇబ్బంది రాకూడదనే ఉద్దేశంతో శస్త్రచికిత్సల అనంతరం పేషెంట్లు కోలుకునే వరకూ ప్రభుత్వం ఆసరాగా ఉండాలనే ఆలోచనతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ వైఎస్సార్ ఆరోగ్య ఆసరా పథకాన్ని అమలు చేస్తున్నారు.

సామాజిక బాధ్యతను గుర్తించండి

సీఎస్ఆర్ భాగస్వామ్య పరిశ్రమల ప్రతినిధుల సమావేశంలో కలెక్టర్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ విజయ రామరాజు

కడప సిటీ : జిల్లా అవసరాలను గుర్తించి ప్రజలకు ప్రయోజనాలు చేకూర్చడంలో సామాజిక బాధ్యతతో తమవంతు భాగస్వాములు కావాలని కార్పొరేట్ పరిశ్రమల ప్రతినిధులకు కలెక్టర్ విజయ రామరాజు సూచించారు. సోమవారం కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో సీఎస్ఆర్(కార్పొరేట్ సోషియల్ రెస్పాన్సిబులిటీ) పథకంలో భాగస్వామ్య పరిశ్రమల ప్రతినిధులతో కలెక్టర్ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎక్కడైతే కార్పొరేట్ పరిశ్రమలు నడుస్తున్నాయో అక్కడి ప్రాంతాలను అభివృద్ధి చేసే బాధ్యతను కూడా యాజమాన్యాలు దృష్టిలో పెట్టుకోవాలన్నారు. అంతే కాకుండా జిల్లాలో ముఖ్యంగా ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వ, ప్రజా ప్రతినిధుల సమన్వయంతో అవసరమైన చోట మౌలిక సదుపాయాల కల్పనకు ముందుకు రావాలన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఓ వెంకట్రావు, జిల్లా పరిశ్రమల శాఖ జీఎం జయలక్ష్మి, సంప్రదాయేతర ఇంధన వనరుల శాఖ జిల్లా కోఆర్డినేటర్ పాల్గొన్నారు.

లే అవుట్లలో అన్ని వసతులు కల్పించండి

జగనన్న హౌసింగ్ లే అవుట్లలో అన్ని వసతులు కల్పించాలని కలెక్టర్ విజయ రామరాజు క్షేత్రస్థాయి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని సభాభవన్‌లో ఆయన జేసీ సాయికాంత్ వర్మ, డీఆర్వో గంగాధర్ గౌడ్, ట్రైనీ కలెక్టర్ రాహుల్ మీనా, హౌసింగ్ పీడీ కృష్ణయ్య లతో కలిసి జగనన్న హౌసింగ్ కాలనీల్లో గృహ నిర్మాణ పనుల పురోగతి, మౌలిక వసతులు, జగనన్న సంపూర్ణ గృహ హక్కు ఓటీఎస్ ప్రక్రియల యాక్షన్ ప్లాన్‌తో పాటు అభివృద్ధి పనులు, ప్రభుత్వ పథకాల అమలు తీరు, పురోగతి అదితర అంశాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఇంకా ప్రారంభం కాని ఇళ్లన్నీ సత్వరమే ప్రారంభించి పునాది స్థాయికి తీసుకురావాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓలు ధర్మచంద్రారెడ్డి, వెంకటరమణ, శ్రీనివాసులు, వెంకటేష్, వివిధ శాఖల అధికారులైన నియోజకవర్గ, మండల ప్రత్యేక అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, తహసీల్దార్లు, ఎంపీడీఓలు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

అభ్యంతరాలను తెలియజేయండి

జిల్లాలో ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి తుది జాబితాలో ఏవైనా అభ్యంతరాలు ఉంటే ఓటరు వారీగా ఫారం- 7 ద్వారా దావా వేయాలని కలెక్టర్ విజయ రామరాజు అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులకు సూచించారు. సోమవారం కలెక్టరేట్‌లోని తన ఛాంబర్‌లో కలెక్టర్ ఎమ్మెల్సీ ఎన్నికల ఓటర్ల తుది జాబితాలో అభ్యంతరాల నమోదు విషయంపై జిల్లాలోని అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి ఓటర్ల తుది జాబితాను రాష్ట్ర ఎన్నికల సంఘం గత ఏడాది డిసెంబర్ 30 న విడుదల చేసిందన్నారు. సంబంధిత జాబితాలో ఓటర్లకు సంబంధించిన వివరాలలో ఏవైనా అభ్యంతరాలుంటే ఫారం- 7 ద్వారా దావా నమోదు చేయాలన్నారు.

ఓటు నమోదుకు అవకాశం

ఎమ్మెల్సీ ఎన్నికల ఓటరు జాబితాలో ఇంకా పేరు నమోదు కాని అర్హులైన అభ్యర్థులు గ్రాడ్యుయేట్స్ అయితే ఫారం-18, ఉపాధ్యాయులు అయితే ఫారం- 19 ద్వారా నమోదు చేసుకోవాలని తెలిపారు. ఈ ప్రక్రియ ఎన్నికల తేదీ ఖరారు అయినంతవరకు కొనసాగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఆర్వో గంగాధర్ గౌడ్, కలెక్టరేట్ సూపరింటెండెంట్ శివారెడ్డి పాల్గొన్నారు.

వేగవంతంగా సమస్యల పరిష్కారం

ప్రజా సమస్యల పరిష్కారం కోసం ఏర్పాటు చేసిన స్పందన కార్యక్రమం ద్వారా స్వీకరించిన అర్జీదారుల సమస్యలను వేగవంతంగా పరిష్కరించాలని అన్ని శాఖల అధికారులను కలెక్టర్ విజయ రామరాజు ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని సభాభవన్‌లో స్పందన కార్యక్రమం జరిగింది. జేసీ సాయికాంత్ వర్మ, డీఆర్వో గంగాధర్ గౌడ్, ట్రైనీ కలెక్టర్ రాహుల్ మీనా పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

ఫిబ్రవరి 1న విద్యార్థులకు శ్లోకాల పోటీ

కడప కల్చరల్ : తిరుమల–తిరుపతి దేవస్థానాల ఆధ్వర్యంలో ఫిబ్రవరి 1న విద్యార్థులకు శ్లోకాల పోటీ నిర్వహించనున్నామని టీటీడీ అనుబంధ సంస్థ హిందూ ధర్మప్రచార పరిషత్ జిల్లా ప్రోగ్రామ్ అసిస్టెంట్ టి.గోపిబాబు తెలిపారు. పదేళ్లలోపు విద్యార్థులు ఈ పోటీలో పాల్గొనవచ్చని, అచ్యుతాష్టకం, విష్ణు సహస్ర నామ శ్లోకాలపై ఈ పోటీ ఉంటుందన్నారు. కడప నగరం టీటీడీ కల్యాణ మండపంలోగల హిందూ ధర్మ ప్రచార పరిషత్ కడప శాఖ ఆధ్వర్యంలో ఉదయం 10 గంటలకు అచ్యుతాష్టకంపై పోటీలు నిర్వహిస్తామన్నారు. 15 ఏళ్ల లోపు విద్యార్థులకు విష్ణు సహస్ర నామ శ్లోకాలపై పోటీ ఉంటుందన్నారు. వివరాలకు 91107 79066 నంబరులో సంప్రదించాలని కోరారు.

ఏపీటీఎఫ్ ప్రధాన కార్యదర్శి సీవీ ప్రసాద్ తొలగింపు

కడప ఎడ్యుకేషన్ : వైఎస్సార్ జిల్లా ఏపీటీఎఫ్ ప్రధాన కార్యదర్శి సీవీ ప్రసాద్‌ను ఆ సంఘం నుంచి తొలగించినట్లు ఏపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు హృదయరాజు, చిరంజీవులు, వైఎస్సార్ జిల్లా ఇన్‌చార్జి చెంగల్రాయమందడి ఒక ప్రకటనలో తెలిపారు. ఆయన సంఘ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడటం వల్ల గత ఏడాది అక్టోబర్ 30వ తేదీన రాష్ట్ర కార్యవర్గ సమావేశం ఆయనను తొలగించిందన్నారు. ఆయన స్థానంలో రాళ్లపల్లి అబ్దుల్లాను నియమించినట్లు వారు తెలిపారు.

బాధితులను వదిలేసి బాబును పరామర్శించడమేంటి!



కడప నగరంలో కేక్ కట్ చేస్తున్న డిప్యూటీ సీఎం అంజద్‌బాషా తదితరులు

- చంద్రబాబు, పవన్‌లకు నైతిక విలువల్లేవు
- ఉప ముఖ్యమంత్రి ఎస్‌బి అంజద్‌బాషా విమర్శ

కడప కార్పొరేషన్ : కందుకూరు, గుంటూరులో చనిపోయిన కుటుంబాలను పరామర్శించకుండా...వారి చావుకు కారణమైన చంద్రబాబును పవన్‌కళ్యాణ్ పరామర్శించడం దారుణమని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి ఎస్‌బి అంజద్‌బాషా అన్నారు. సోమవారం ప్రజా సంకల్పయాత్ర ముగిసి నాలుగేళ్లు పూర్తయిన సందర్భంగా కడప హెడ్‌పోస్టాఫీసు సమీపంలోని వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. కేక్ కట్ చేసి పంపిణీ చేశారు. అనంతరం డిప్యూటీ సీఎం మీడియాతో మాట్లాడుతూ చంద్రబాబు స్వార్థం వల్ల 11 మంది చనిపోతే ఏ ఒక్కరినీ పవన్ పరామర్శించిన పాపాన పోలేదన్నారు. చంద్రబాబును ఆయన పరామర్శించడానికి వెళ్లాడో, ప్యాకేజీ కోసం వెళ్లాడో తెలియదన్నారు. వారిరువురికీ నైతిక విలువల్లేవన్నారు. కాపుల ఓట్లను గంపగుత్తగా టీడీపీకి వేయించడమే పవన్ ముఖ్య ఉద్దేశమన్నారు.

ప్రజలకు మేలు చేయాలని తపన పడుతున్న సీఎంను దీవించండి

ప్రజలకు మేలు చేయాలని తపన పడుతున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఆశీర్వదించాలని అంజద్‌బాషా కోరారు. ప్రజా సంకల్పయాత్రలో వైఎస్ జగన్ వేసిన ప్రతి అడుగు కోట్లాది మంది ప్రజల జీవితాల్లో వెలుగులు నింపిందన్నారు. దేశంలో ఏ నాయకుడూ చేయని విధంగా 14 నెలలు కుటుంబాన్ని వదిలేసి పాదయాత్ర చేయడం సాహసమన్నారు. పాదయాత్రలో ఇచ్చిన హామీలను నవరత్నాల రూపంలో అమలు చేశారని, ఇప్పటికి 98.5 శాతం హామీలను నెరవేర్చడం ద్వారా రూ.1.78లక్షల కోట్లను నేరుగా లబ్ధిదారుల ఖాతాలో జమ చేశారన్నారు. తద్వారా దేశంలోనే ఆదర్శ ముఖ్యమంత్రిగా నిలిచారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి అఫ్జల్‌ఖాన్, డాక్టర్ సొహైల్, సుబ్బారెడ్డి, శ్రీరంజన్‌రెడ్డి, సీహెచ్ వినోద్, బండి ప్రసాద్, జహీర్, షఫీ తదితరులు పాల్గొన్నారు.

ప్రజల ప్రాణాలతో చంద్రబాబు చెలగాటం

ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి



మాట్లాడుతున్న ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి

పులివెందుల : తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబు నాయుడు పబ్లిసిటీ పిచ్చితో ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారని కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి విమర్శించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాడు ప్రజా సంకల్ప యాత్ర పేరుతో చేసిన పాదయాత్రకు నాలుగేళ్లు పూర్తయిన సందర్భంగా స్థానిక భాకరాపురంలోని వైఎస్సార్ ఆడిటోరియంలో కేక్ కట్ చేసి పార్టీ నాయకులకు, అభిమానులకు తినిపించారు. అంతకుముందు వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కందుకూరులో విశాలమైన రోడ్డులో సభ పెట్టుకోవడానికి పోలీసులు అనుమతి ఇస్తే వంద మీటర్లు ముందుకు వచ్చి ఇరుకైన రోడ్డులో డ్రోన్ల ద్వారా జనాలను చూపించడానికి సభ ఏర్పాటు చేసి 8మంది అమాయక ప్రజల ప్రాణాలను బలిగొన్నారన్నారు. అలాగే గుంటూరులో మరో ముగ్గురి ప్రాణాలను కూడా బలిగొన్నారన్నారు. ఒక అబద్ధాన్ని వందసార్లు చెబితే నిజమవుతుందన్న ఫిలాసఫీతో ఎల్లో మీడియా ద్వారా తీవ్ర దుష్ప్రచారాలు చేస్తున్నారని ధ్వజమెత్తారు.

సంక్షేమం – అభివృద్ధే ధ్యేయం

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమం – అభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తున్నారని ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి పేర్కొన్నారు. గత ప్రభుత్వంలో ఆరోగ్యశ్రీ పథకం కింద వెయ్యి జబ్బులకు చికిత్సలు అందించేవారని.. మన ప్రభుత్వంలో దాదాపు 2,200కుపైగా జబ్బులకు ఆరోగ్య శ్రీ ద్వారా చికిత్సలు అందిస్తున్నారన్నారు. గత ప్రభుత్వంలో ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకం పూర్తిగా నిర్వీర్యమైపోయిందన్నారు. మన ప్రభుత్వంలో పాత బకాయిలు చెల్లించడమే కాకుండా ఫీజు మొత్తాన్ని రీయింబర్స్‌మెంట్ చేస్తున్నామన్నారు. వసతి దీవెన, అమ్మఒడి, గోరు ముద్ద, ఇంగ్లీషు మీడియం, నాడు – నేడు తదితర పథకాలతో విద్యాభివృద్ధికి కృషి చేస్తున్నారన్నారు. అంతేకాకుండా రైతు భరోసా, ఇన్‌పుట్ సబ్సిడీ రూపంలో పంట నష్టపోయిన ఏడాదిలోగా నష్టపరిహారం అందిస్తున్నామన్నారు. గత ప్రభుత్వం డ్రిప్ పరికరాల విషయంలో దాదాపు రూ.1000కోట్లు అప్పులు మిగల్చగా.. మన ప్రభుత్వం అప్పును చెల్లించి డ్రిప్ పరికరాల పథకాన్ని పునరుద్ధరించిందన్నారు. రాష్ట్రంలో 30లక్షల మందికి ఇళ్ల పట్టాలు అందించడమే కాకుండా.. 21లక్షల ఇళ్లు నిర్మాణ దశలో ఉన్నాయన్నారు. గతంలో సీబీఆర్ డ్యాంలో 6టీఎంసీల నీరు నిల్వ చేసుకుంటే మన ప్రభుత్వం వచ్చాక 10టీఎంసీల నీరు నిల్వ చేసుకున్నామన్నారు. అలాగే గండికోట ప్రాజెక్టులో 8టీఎంసీల నుంచి 26టీఎంసీల నీరు నిల్వ చేసుకున్నామన్నారు. దివంగత వైఎస్సార్ చిరకాల కోరిక పులివెందులకు మెడికల్ కళాశాల కూడా ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. కడప నుంచి తిరుపతికి నేషనల్ హైవే మంజూరు చేయించామన్నారు. అంతకమునుపు నియోజకవర్గ పరిశీలకుడు శ్రీనివాసరెడ్డి, మున్సిపల్ ఇన్‌చార్జి వైఎస్ మనోహర్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు బలరామిరెడ్డి, రవికుమార్‌రెడ్డి తదితరులు ప్రసంగించారు.

క్రీడా స్ఫూర్తితో ఆడాలి

- పోలీసు క్రీడలను ప్రారంభించిన జిల్లా ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్
- ఉత్సాహంగా పాల్గొన్న పోలీసు అధికారులు, సిబ్బంది

కడప అర్బన్ : క్రీడా స్ఫూర్తితో ఆటల్లో పాల్గొనాలని, గెలుపోటములు ముఖ్యంకాదని జిల్లా ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్ పేర్కొన్నారు. జిల్లా పోలీసుశాఖ ఆధ్వర్యంలో కానిస్టేబుల్ నుంచి డీఎస్పీ స్థాయి వరకు పాల్గొనే జిల్లా పోలీసు గేమ్స్ అండ్ స్పోర్ట్స్ మీట్ 2023ను జిల్లా ఎస్పీ సోమవారం స్థానిక పోలీస్ పెరేడ్ మైదానంలో ప్రారంభించారు. ప్రారంభ సూచకంగా బెలూన్‌లు, పావురాలు ఎగరేశారు. జిల్లాకు చెందిన జాతీయ స్థాయి హాకీ క్రీడాకారుడు, ఏ.ఆర్. హెడ్‌కానిస్టేబుల్ ఎం.ఎస్. విజయభాస్కర్ ఒలింపిక్ కాగడాను జిల్లా ఎస్పీ అన్బురాజన్‌కు అందజేయగా పోలీస్ పెరేడ్ మైదానంలోని జ్యోతిని వెలిగించి ప్రారంభించారు. పోటీల్లో పాల్గొనే కడప, ప్రొద్దుటూరు, పులివెందుల, జమ్మలమడుగు, మైదుకూరు, సబ్‌డివిజన్‌లతో పాటు డి.ఎ.ఆర్ జట్టుకు చెందిన క్రీడాకారులు మార్చ్‌ఫాస్ట్ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ క్రీడల వల్ల మానసిక ఉల్లాసంతో పాటు శారీరక దారుఢ్యం పెంపొందుతుందన్నారు. నిరంతరం విధుల్లో ఉండే పోలీసు సిబ్బంది క్రీడలతో ఒత్తిడి నుంచి బయటపడవచ్చన్నారు. క్రీడల్లో భాగంగా హాకీ, వాలీబాల్, కబడ్డీ, ఫుట్‌బాల్, టగ్ ఆఫ్ వార్, బాస్కెట్‌బాల్, షటిల్‌కాక్ అలాగే మహిళలకు కబడ్డీ, ఖోఖో పోటీలు నిర్వహించనున్నారు. అథ్లెటిక్స్ విభాగంలో పరుగు పోటీలతో పాటు హైజంప్, లాంగ్‌జంప్, షాట్‌పుట్, డిస్కస్‌త్రో, జావెలిన్‌త్రో విభాగాల్లో పోటీలు ఉంటాయి. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ (పరిపాలన) తుషార్ డూడి, ప్రొద్దుటూరు ఏఎస్పీ ప్రేర్ణాకుమార్, ఏఆర్ అదనపు ఎస్పీ ఎస్.ఎస్.ఎస్.వి కృష్ణారావు, డీఎస్పీలు రమణయ్య, బి. వెంకట శివారెడ్డి, వంశీధర్‌గౌడ్, శ్రీనివాసులు, చెంచుబాబు, ఆర్ఐలు సోమశేఖర్‌నాయక్, వీరేష్, నగరంలోని సీఐలు, ఎస్ఐలు, ఆర్ఎస్ఐలు, పోలీసు అధికారుల సంఘం జిల్లా అధ్యక్షుడు దూలం సురేష్, ఉపాధ్యక్షుడు ఉప్పు శంకర్, అసోసియేషన్ సభ్యులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



క్రీడాకారుడిని పరిచయం చేసుకుంటున్న జిల్లా ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్



లాంగ్ జంప్ చేస్తున్న క్రీడాకారుడు

బోధన ప్రమాణాలు, పరిశోధనలపై ప్రత్యేక గురి

- నూతన వైస్ చాన్సలర్ ఆచార్య జింకా రంగజనార్దన
- వైవీయూ వీసీగా బాధ్యతల స్వీకరణ
- ఎన్ఐఆర్ఎఫ్ ర్యాంకింగ్‌లో 100లోపు తెచ్చేందుకు కృషి
- దూరవిద్య అందుబాటులోకి
- శుభాకాంక్షలు తెలిపిన బోధన, బోధనేతర సిబ్బంది



వ్యాయామవిద్య, క్రీడాశాస్త్ర విభాగంలో రైఫిల్ షూటింగ్ చేస్తున్న వీసీ ఆచార్య రంగ జనార్దన

వైవీయూ : విశ్వవిద్యాలయంలో విద్యనభ్యసించే విద్యార్థులకు నాణ్యమైన బోధన, పరిశోధనలు అందించడంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటామని యోగివేమన విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ (ఎఫ్ఏసీ) ఆచార్య జింకా రంగజనార్దన పేర్కొన్నారు. వైవీయూ ఇన్‌చార్జి వైస్ చాన్సలర్‌గా నియమితులైన ఆయన సోమవారం ఉదయం పూజా కార్యక్రమాలు నిర్వహించి బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయనకు రిజిస్ట్రార్ ఆచార్య వై.పి. వెంకటసుబ్బయ్య ఆధ్వర్యంలో అధ్యాపకులు ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచ పోటీని తట్టుకుని నిలబడేలా విశ్వవిద్యాలయాల్లో చదివే విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాల్సిన బాధ్యత అధ్యాపకులపై ఉందన్నారు. వైవీయూకు రెండో సైకిల్‌లోనే న్యాక్ ఏ గ్రేడ్ లభించడం ఇక్కడి అధ్యాపకులు, సిబ్బంది టీం పనితీరుకు నిదర్శనమన్నారు. నేషనల్ ఇన్‌స్టిట్యూషనల్ ఫ్రేమ్‌వర్క్ (ఎన్ఐఆర్ఎఫ్) ర్యాంకు 101 నుంచి 150 మధ్యలో ఉన్నామని, రానున్న రోజుల్లో ఈ ర్యాంకును 100లోపు తీసుకువచ్చేందుకు కృషిచేస్తామని తెలిపారు. అదే విధంగా వైవీయూలో దూరవిద్యను ప్రారంభించడంతో పాటు డిమాండ్ ఉన్న కోర్సులను అందుబాటులోకి తీసుకువస్తామన్నారు. విశ్వవిద్యాలయంలో పరిశోధనలకు పెద్దపీట వేసేలా మౌలిక సదుపాయాలు కల్పిస్తామన్నారు. తనకు అవకాశం కల్పించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి, మంత్రి బొత్స సత్యనారాయణ, ఏపీ ఉన్నతవిద్యామండలి అధికారులకు ఆయన ధన్యవాదాలు తెలిపారు. అనంతరం విశ్వవిద్యాలయంలోని డీన్‌లు, ఆచార్యులు, విభాగాధిపతులు, అధ్యాపకులతో సమావేశం నిర్వహించి దిశానిర్దేశం చేశారు. అనంతరం పలు విభాగాలను ఆయన పరిశీలించారు.

శుభాకాంక్షల వెల్లువ..

నూతన వీసీగా బాధ్యతలు చేపట్టిన ఆచార్య జింకా రంగ జనార్దనను రిజిస్ట్రార్ ఆచార్య వై.పి. వెంకటసుబ్బయ్య, ప్రిన్సిపాల్ ఆచార్య కె. కృష్ణారెడ్డి, ప్రొద్దుటూరు ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య నాగరాజు, పాలకమండలి సభ్యులు ఆచార్య పుత్తా పద్మ, డాక్టర్ వైఎస్ఆర్ ఏఎఫ్‌యూ రిజిస్ట్రార్ ఆచార్య ఇ.సి. సురేంద్రనాథ్‌రెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ ఆచార్య టి. శ్రీనివాస్, డీన్‌లు ఆచార్య రామప్రసాద్ రెడ్డి, ఆచార్య రమణయ్య, ఆచార్య విజయరాఘవప్రసాద్, ఆచార్య పి.ఎస్. షావల్లీఖాన్, ఆచార్య కె. గంగయ్య, ఆచార్య వై. సుబ్బరాయుడు, ఆచార్య ఎన్. ఈశ్వరరెడ్డి, ఆచార్య జయచంద్రారెడ్డి, డాక్టర్ ఎస్.వి. సుబ్బారెడ్డి, వివిధ విభాగాల అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది కలిసి వీసీకి శుభాకాంక్షలు తెలిపారు.

సూర్యుడు ఆరోగ్య ప్రదాత

దత్త పీఠాధిపతి శ్రీగణపతి సచ్చిదానందస్వామి



మాట్లాడుతున్న దత్తపీఠాధిపతి శ్రీగణపతి సచ్చిదానంద స్వామి

ప్రొద్దుటూరు కల్చరల్ : సూర్యుడు ఆరోగ్య ప్రదాత అని మైసూరు దత్తపీఠాధిపతి శ్రీగణపతి సచ్చిదానంద స్వామి పేర్కొన్నారు. స్థానిక అనిబిసెంటు మున్సిపల్ హైస్కూల్‌లో సోమవారం స్వామి భక్తుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్టేజీని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా స్వామి మాట్లాడుతూ ప్రతి రోజు సూర్యనమస్కారాలు చేయడం వల్ల సంపూర్ణ ఆరోగ్యం కలుగుతుందన్నారు. మనసుకు అధిపతి చంద్రుడు అని, చంద్రుడిని దర్శిస్తే మనసు ప్రశాంతంగా ఉంటుందన్నారు. గణపతి, నవగ్రహ, చండీ తదతర హోమాలు చేయడం, పాల్గొనడం ద్వారా ఐశ్వర్యం సిద్ధిస్తుందన్నారు. భజనలు చేస్తే శరీరంలో ఆక్సిజన్ శాతం పెరిగి ఆరోగ్యంగా ఉంటారన్నారు. మనసును ప్రశాతంగా ఉంచుకోవాలని, అతిగా మాట్లాడ వద్దని, తక్కువ మాట్లాడి ప్రశాంతంగా ఉండాలన్నారు. తాను అనిబిసెంట్ మున్సిపల్ హైస్కూల్‌లో చదివానని అప్పటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. స్కూలు శతాబ్ది ఉత్సవాలకు తనను ఆహ్వానించినా రాలేకపోయానని, మనసంతా ప్రొద్దుటూరులోనే ఉందన్నారు. ప్రపంచం మొత్తం 160 సార్లు తిరిగానని, అన్ని చోట్ల తనకు భక్తులు ఉన్నారన్నారు. భక్తులకు ప్రసాద వినియోగం చేశారు. ముందుగా స్వామి విద్యార్థులతో మాట్లాడారు. విద్యార్థులు బాగా చదువుకోవాలని, ఉన్నత స్థానాల్లో నిలవాలని హితోపదేశం చేశారు. ముందుగా వైఎంఆర్ కాలనీలోని దత్తపీఠంలో సోమవారం ఉదయం దేవతామూర్తులకు ప్రత్యేక పూజలతోపాటు శ్రీచక్ర పూజ, మహాసంప్రోక్షణ, మహా కుంభాభిషేకం నిర్వహించారు. కార్యక్రమంలో దత్తపీఠం ఉత్తరాధికారి విజయానంద తీర్థ స్వామి, భక్తులు పాల్గొన్నారు.

గండికోటలో సినీ స్టూడియో నిర్మించాలి

- ఘనంగా ఆవిర్భావ దినోత్సవం
- రాజవంశీయుడు ప్రభాకర్‌నాయుడు



గండికోట ఫొటోలను ఆవిష్కరిస్తున్న ప్రముఖులు

కడప కల్చరల్ : గండికోటలో సినిమా స్టూడియో నిర్మించాలని, అటు సినీ పరిశ్రమ విస్తరించడమే కాకుండా ఉపాధి అవకాశాలు పెరిగి జిల్లా మరింత అభివృద్ధి చెందగలదని గండికోట రాజవంశీయులు పెమ్మసాని ప్రభాకర్‌నాయుడు తెలిపారు. సోమవారం రాయలసీమ టూరిజం అండ్ కల్చరల్ సొసైటీ కార్యదర్శి కొండూరు జనార్దన్‌రాజు ఆధ్వర్యంలో గండికోట 900వ ఆవిర్భావ దినోత్సవం జనవరి 9న పురస్కరించుకుని కడప నగరం హోటల్ గ్రాండ్ ఇన్‌లో ఆయన ఇతర అతిథులతో కలిసి గండికోట ఫొటోల ప్రదర్శన ప్రారంభించి కొత్త ఫొటోలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గండికోటకు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ హయాంలో ఒబెరాయ్ హోటల్స్ రావడం, స్టార్‌హోటళ్లు, విల్లాలు నిర్మాణమయ్యే అవకాశాలు పెరిగాయన్నారు. ఇప్పటికే కోటలో సినిమా షూటింగ్‌లు జరుగుతున్నాయని, స్టూడియో నిర్మిస్తే ఆ ప్రాంతం దశ మారుతుందన్నారు. సంస్థ చీఫ్ ప్యాట్రన్ లయన్ మానస చిన్నపరెడ్డి మాట్లాడుతూ వెడ్డింగ్ షూట్‌లతోపాటు గండికోటలో తరచూ వివాహాలు, షార్ట్‌ఫిల్మ్‌లు నిర్మిస్తున్నారని, ఫ్రీ కోట్ టెంట్ల ద్వారా పెద్ద ఎత్తున పర్యాటకులకు వసతులు కల్పిస్తూ స్థానికులు ఆదాయం పొందుతున్నారని తెలిపారు. అక్కడ పెద్ద ఎత్తున బడ్జెట్ హోటళ్లు నిర్మించాల్సిన అవసరం ఉందన్నారు. సంస్థ ప్యాట్రన్ పద్మప్రియ చంద్రారెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం పక్షాన గండికోటలో సినీ స్టూడియో నిర్మిస్తే ఈ ప్రాంతంలోని ఇతర పర్యాటక ప్రాంతాలు కూడా గొప్పగా అభివృద్ధి చెంది జిల్లా ఆర్థికంగా బలపడగలదన్నారు. గ్రాండ్ ఇన్ హోటల్ అధినేత చిన్నప్పరెడ్డి మాట్లాడుతూ గండికోటలో రోప్‌వే నిర్మాణం జరుగుతున్నదని, దీంతోపాటు గ్లాస్ బ్రిడ్జి నిర్మాణం జరిగితే అంతర్జాతీయంగా పర్యాటకులు వెల్లువెత్తే అవకాశం ఉందన్నారు. పండ ట్రావెల్స్ అధినేత సయ్యద్ మాట్లాడుతూ ప్రత్యేక ప్యాకేజీల ద్వారా గండికోటలో పర్యాటకులను పెంచేందుకు ప్రయత్నించాలన్నారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ఆఫ్ కడప అన్నమయ్య అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ ఆర్. రంగనాథరెడ్డి, గౌరీశంకర్, పలువురు టూరిజం అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

సిద్దవటేశ్వరస్వామి ఆలయ అభివృద్ధికి కృషి



సిద్దవటంలోని కామాక్షీదేవి సిద్దవటేశ్వరస్వామి ఆలయంలో పూజలు చేస్తున్న ఈఓ లవన్న

సిద్దవటం : శ్రీశైల దేవస్థానానికి దక్షిణ ముఖ ద్వారమైన సిద్దవటం అతి పవిత్రమైన ద్వారమని శ్రీశైలం ఆలయం ఈఓ లవన్న అన్నారు. సిద్దవటంలోని పెన్నా నది ఒడ్డున వెలసిన శ్రీకామాక్షిదేవి సిద్దవటేశ్వరస్వామి ఆలయాన్ని ఆయన సోమవారం సందర్శించారు. తహసీల్దారు శంకర్‌రావు ఆయనను శాలువాతో సత్కరించారు. అనంతరం గర్భగుడిలోకి వెళ్లి స్వామి వారికి అభిషేకం, ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ శ్రీశైల దేవస్థానానికి నాలుగు ముఖద్వారాలు ఉన్నాయని.. జోగిలాంబ, అలంపూర్ ద్వారాలు తెలంగాణ రాష్ట్రంలోకి పోయాయని తెలిపారు. త్రిపురాంతకం ద్వారం సంబంధించి అభివృద్ధి అక్కడి వారే చేస్తామని చెప్పారన్నారు. మిగిలిన దక్షిణ ద్వారం సిద్దవటమని, ఇక్కడి ఆలయంలో విద్యుత్ సౌకర్యం , గర్భగుడిలో పానుమట్టం అభివృద్ధి చేస్తామన్నారు. ధ్వజస్తంభం, గర్భగుడి, ఆలయం లోపల, ధ్వజ స్తంభం ఆవరణలో గ్రానైట్ బండపరుపు చేయిస్తామన్నారు. గోపురంపై శిఖర గోపురం, ఆలయానికి మూడు తలుపులు కొత్తవి వేసి అభివృద్ధి చేస్తామన్నారు. అర్చకులు ఉండటానికి ఆలయం అవరణలోనే ఒక గదిని నిర్మిస్తామని అన్నారు. అనంతరం జ్యోతి గ్రామ శివారులోని జ్యోతి సిద్దవటేశ్వరస్వామిని దర్శించుకొని పూజలు చేశారు. అలయం పరిసర ప్రాంతాలను పరిశీలించి ఇక్కడి అలయాన్ని కూడా అభివృద్ధి చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో తిరుపతికి చెందిన ఏకవీరాసేవా వ్యవస్థాపకులు ప్రతాప్‌స్వామిజీ, దేవదాయ శాఖ అసిస్టెంటు కమిషనర్ శంకర్‌బాలాజి, శ్రీశైల దేవస్థానం సూపరింటెండెంట్ రంగస్వామి, స్తపతి దవహ, శ్రీశైలం దేవస్థానం ఈఈ రామక్రిష్ణ, జేఈఓ హరిదాస్, ఏఈ సీతారామయ్య, తహసీల్దారు శంకర్‌రావు, శ్రీశైలం దేవస్థానం ప్రధాన అర్చకులు నాగరాజు శాస్త్రీ, మధుస్వామి, ఆలయ అర్చకులు పర్వతయ్య, ఆదివయ్య, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

35 ఏళ్ల తర్వాత లాభాల బాటలో డీసీసీబీ

- సీఎం జగన్ నిర్ణయంతో ఎన్నో సంస్కరణలు
- ఆప్కాబ్ చైర్‌పర్సన్ మల్లేల ఝాన్సీరాణి



మాట్లాడుతున్న ఆప్కాబ్ చైర్‌పర్సన్ మల్లేల ఝాన్సీరాణి

ప్రొద్దుటూరు : కోట్ల రూపాయల నష్టాల్లో ఉన్న కడప జిల్లా కేంద్ర సహకార బ్యాంకు (డీసీసీబీ) 35 ఏళ్ల తర్వాత లాభాల బాటలో నడుస్తోందని ఆప్కాబ్ చైర్‌పర్సన్ మల్లేల ఝాన్సీరాణి పేర్కొన్నారు. ప్రొద్దుటూరు మండలంలోని లింగాపురంలో ఉన్న తన స్వగృహంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. ఆప్కాబ్‌కు వందేళ్ల చరిత్ర ఉందని తెలిపారు. మొదటి నుంచి కేవలం రైతులకు మాత్రమే రుణాలు ఇచ్చేవారన్నారు. ప్రజలందరికీ లబ్ధి చేకూర్చాలనే ఆశయంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆప్కాబ్‌లో ఎన్నో సంస్కరణలు తెచ్చారని పేర్కొన్నారు. స్వయం సహాయక సంఘాలు, చిన్న వ్యాపారులతో పాటు జగనన్న తోడు ద్వారా రుణాలు ఇస్తున్నామన్నారు. వాణిజ్య బ్యాంకులకు పోటీగా అన్ని వర్గాల వ్యాపారులకు రుణాలు మంజూరు చేస్తున్నట్లు తెలిపారు.

కడపలో స్టేట్ ట్రైనింగ్ కాలేజీ

రాష్ట్ర విభజన తర్వాత కోఆపరేటివ్ ట్రైనింగ్ కాలేజీ కడపలో నిర్మించేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గత నెలలో శంకుస్థాపన చేశారని ఆప్కాబ్ చైర్‌పర్సన్ మల్లేల ఝాన్సీరాణి పేర్కొన్నారు. ప్రస్తుతం హైదరాబాద్‌లో ఉన్న ఈ కాలేజీలో మన రాష్ట్రానికి 2024 వరకు మాత్రమే గడువు ఉందని తెలిపారు. పంట రుణాలకు సంబంధించి ఎస్‌బీఐ, కెనరాబ్యాంకు, యూనియన్‌బ్యాంకు తర్వాత ఆప్కాబ్ నాలుగో స్థానంలో ఉందని చెప్పారు. చిన్నతరహా పరిశ్రమల ఏర్పాటు కోసం ప్రత్యేకంగా రుణాలు మంజూరు చేస్తున్నామని, నేషనల్ లైవ్ స్టాక్ మిషన్‌ద్వారా రూ.10 నుంచి 50 లక్షల వరకు రుణాలు ఇస్తున్నట్లు చెప్పారు. చేపల పెంపకానికి సబ్సిడీ రుణాలు మంజూరు చేస్తున్నామని తెలిపారు. వైఎస్సార్ యంత్ర సేవా పథకం ద్వారా గత ఏడాది నుంచి రుణాలు ఇస్తున్నామన్నారు. సమావేశంలో మండల మాజీ ఉపాధ్యక్షుడు మల్లేల రాజారాంరెడ్డి, లింగాపురం ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం అధ్యక్షుడు తుపాకుల ప్రతాప్‌రెడ్డి, చెన్నమరాజుపల్లె ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం అధ్యక్షుడు వెంకటసుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆధిక్యంలో ఆంధ్రా జట్టు

డబుల్ సెంచరీతో చెలరేగిన మహీప్‌కుమార్



బ్యాటింగ్ చేస్తున్న ఆంధ్రా బ్యాట్స్‌మన్



240 పరుగులతో నాటౌట్‌గా నిలిచిన ఆంధ్రా ఓపనర్ కె. మహీప్‌కుమార్



4 వికెట్లు తీసిన చండీగఢ్ బౌలర్ అసద్

కడప స్పోర్ట్స్ : కడప నగరంలోని వైఎస్ రాజారెడ్డి-ఏసీఏ క్రికెట్ మైదానంలో కల్నల్ సీకే నాయుడు ట్రోఫీలో భాగంగా నిర్వహిస్తున్న అంతర్ రాష్ట్రాల అండర్-25 క్రికెట్ మ్యాచ్‌లో ఆంధ్రా జట్టు ఆధిక్యంలో కొనసాగుతోంది. 68 పరుగుల ఓవర్‌నైట్ స్కోరుతో బరిలోకి దిగిన ఆంధ్రా జట్టు రెండో రోజైన సోమవారం ఆట ముగిసే సమయానికి 121 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 417 పరుగులు చేసింది. జట్టులోని ఓపెనింగ్ బ్యాట్స్‌మన్ కె.మహీప్‌కుమార్ 354 బంతుల్లో 27 ఫోర్లు, 3 సిక్సర్‌లతో 240 పరుగులతో నాటౌట్‌గా నిలిచాడు. ఆంధ్రా జట్టు కెప్టెన్ గిరినాథ్ రెడ్డి 156 బంతుల్లో 15 ఫోర్లతో 113 పరుగులు చేశాడు. మహీప్‌కుమార్, గిరినాథ్‌రెడ్డిలు 301 బంతుల్లో 235 పరుగుల భాగస్వామ్యం నెలకొల్పారు. చండీగఢ్ బౌలర్ మోహమ్మద్ అసద్ 4 వికెట్లు తీశాడు. దీంతో రెండో రోజు ఆట ముగిసే సమయానికి ఆంధ్రా జట్టు 231 పరుగుల ఆధిక్యంలో కొనసాగుతోంది.

గల్లంతైన యువకుడి మృతదేహం లభ్యం



ఆదినిమ్మాయపల్లె ఆనకట్ట వద్ద లభించిన సుదర్శన్‌రెడ్డి మృతదేహం

వల్లూరు : మండలంలోని ఆదినిమ్మాయపల్లె ఆనకట్ట వద్ద పెన్నానదిలో ఆదివారం గల్లంతైన కనపర్తి సుదర్శన్‌రెడ్డి (27) మృతదేహం లభ్యం అయినట్లు ఎస్‌ఐ విష్ణువర్ధన్ తెలిపారు. సోమవారం స్థానిక పోలీసులు, రెస్క్యూ టీం, జాలర్లతో కలసి ఆనకట్ట పరిసర ప్రాంతాల్లో గాలించారు. ఆనకట్ట సమీపంలోనే మృతదేహం లభ్యం అయినట్లు ఎస్‌ఐ తెలిపారు. సంఘటనా స్థలం వద్దకు చేరుకున్న మృతుని కుటుంబ సభ్యులు మృతదేహాన్ని చూసి బోరున విలపించారు. 'అప్పుడే నీకు నూరేళ్లు నిండాయా' అంటూ మృతుని బంధువులు, కుటుంబ సభ్యులు చేసిన రోదనలు మిన్నంటాయి. శవ పంచనామా నిర్వహించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రిమ్స్‌కు తరలించారు. అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

రెజ్లింగ్ ఎంపికలకు విశేష స్పందన



ఎంపికలను ప్రారంభిస్తున్న శాప్ డైరెక్టర్ డానియల్ ప్రదీప్

కడప స్పోర్ట్స్ : కడప నగరంలోని వైఎస్సార్ ఇండోర్ స్టేడియంలో సోమవారం నిర్వహించిన జిల్లాస్థాయి రెజ్లింగ్ ఎంపికలకు క్రీడాకారుల నుంచి విశేష స్పందన లభించింది. ఈ ఎంపికలను శాప్ బోర్డు డైరెక్టర్ మైఖెల్ డానియల్ ప్రదీప్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడాకారుల్లోని ప్రతిభను వెలికితీసేందుకు శాప్ లీగ్ పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. డీఎస్‌ఏ చీఫ్ కోచ్ ఎస్.వి.పి.అమృత్‌రాజ్ మాట్లాడుతూ జిల్లా జట్టుకు ఎంపికయ్యే క్రీడాకారులు ఈ నెల 11, 12 తేదీల్లో అనంతపురంలో నిర్వహించే రాష్ట్ర స్థాయి శాప్‌లీగ్ రెజ్లింగ్ పోటీల్లో పాల్గొనాల్సి ఉంటుందని పేర్కొన్నారు. అనంతరం ఎంపికలు నిర్వహించి జిల్లా జట్లను ఎంపిక చేశారు. కార్యక్రమంలో జిల్లా ఒలింపిక్ సంఘం పూర్వపు అధ్యక్షులు కె.ఎస్. సమరనాథరెడ్డి, ఫిజికల్ డైరెక్టర్ ఎస్.సాజిత్, కోచ్ మస్తాన్ పాల్గొన్నారు.

నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పనే సీఎం ధ్యేయం



డిక్సన్ కంపెనీ ఆధ్వర్యంలో జరుగుతున్న ఫ్యాక్టరీ పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి

వల్లూరు : నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించడం ద్వారా వారి కుటుంబాలకు ఆర్థిక సహకారం అందించాలనే ఆశయంతో సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి కృషి చేస్తున్నారని కమలాపురం ఎమ్మెల్యే పి. రవీంద్రనాథ్‌రెడ్డి పేర్కొన్నారు. కొప్పర్తి మెగా ఇండస్ట్రియల్ పార్కులోని డాక్టర్ వైఎస్ఆర్ ఈఎమ్‌సీలో నిర్మాణంలో ఉన్న డిక్సన్ టెక్నాలజీస్ ప్రైవేట్ లిమిటెడ్‌ను సోమవారం ఆయన సందర్శించారు. ప్లాంట్ నిర్మాణ వివరాలను, పనుల ప్రగతిని గురించి ప్లాంట్ హెడ్ పాండురంగ రాజుతో ఆరా తీశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇప్పటికే 17 ఐటీ బేస్డ్ ప్లాంట్‌లను కలిగిన డిక్సన్ కంపెనీ 10 వేల కోట్లకు పైగా టర్నోవర్‌ను కలిగి ఉందన్నారు. సీఎం చొరవతో అలాంటి భారీ కంపెనీ నెలకు 10 లక్షల కెమెరాలు, 2 లక్షల డీవీఆర్‌లు, ఎన్‌వీఆర్‌ల తయారీ సామర్థ్యంతో ప్లాంట్ నిర్మాణానికి ముందుకు వచ్చిందన్నారు. నిర్మాణ పనులను పూర్తి చేసుకుని ఒకటి రెండు నెలల్లో ఉత్పత్తులను ప్రారంభించేందుకు సిద్ధమవుతోందన్నారు. ఈ ప్లాంట్ నిర్మాణం ద్వారా సుమారు 1800 మంది యువతకు ఉద్యోగాలు లభిస్తాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కమలాపురం నగర పంచాయతీ వైస్ చైర్మన్ శ్రీనివాసులు రెడ్డి, కార్పొరేటర్ పాకా సురేష్ పాల్గొన్నారు.

చెరువులో మునిగి వ్యక్తి మృతి



శివారెడ్డి మృతదేహం వద్ద విలపిస్తున్న బంధువులు

మైదుకూరు : మైదుకూరు మున్సిపాలిటీ పరిధిలోని చిన్నయ్యగారిపల్లెకు చెందిన అన్నపురెడ్డి శివారెడ్డి (42) అనే వ్యక్తి బర్రెలను తోలుతూ చెరువులో మునిగి మృతి చెందాడు. వివరాలు ఇలా ఉన్నాయి. ఆదివారం బర్రెలను మేపుకొంటూ శివారెడ్డి సమీపంలోని ఎల్లంపల్లె చెరువు వద్దకు తోలుకొని వెళ్లాడు. బర్రెలు చెరువులోకి దిగడంతో అతను కూడా చెరువులోకి దిగి వాటిని గట్టుకు తోలేందుకు ప్రయత్నిస్తూ.. లోతైన గుంతలో కూరుకుపోయాడు. సాయంత్రం బర్రెలు ఇంటికి వెళ్లడంతో కుటుంబ సభ్యులు శివారెడ్డి కోసం రాత్రంతా గాలించారు. సోమవారం ఉదయం చెరువులో అతని మృతదేహాన్ని గుర్తించారు. మృతునికి భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

ఫిర్యాదులపై సత్వరం న్యాయం చేయాలి

కడప అర్బన్ : జిల్లాలో బాధితులు పోలీసు శాఖకు ఇచ్చే ఫిర్యాదుల పట్ల సత్వరం స్పందించి తగు చర్యలు తీసుకోవాలని జిల్లా ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్ పోలీసు అధికారులను ఆదేశించారు. సోమవారం కడప నగరంలోని జిల్లా పోలీసు కార్యాలయంలో జిల్లా ఎస్పీ 'స్పందన' కార్యక్రమంలో బాధితులతో స్వయంగా ముఖాముఖి మాట్లాడి, వీడియో కాన్ఫరెన్స్ ద్వారా వారి సమస్యలను తెలుసుకున్నారు. 'స్పందన' ఫిర్యాదులకు అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాలని, నిర్ణీత సమయంలో వాటిని పరిష్కరించాలని ఆయన ఆదేశించారు.

రేపు జిల్లా స్థాయి షూటింగ్ బాల్ ఎంపికలు

కడప స్పోర్ట్స్ : మైదుకూరు పట్టణంలోని మేధా డిఫెన్స్ అకాడమీలో ఈనెల 11వ తేదీన జిల్లాస్థాయి షూటింగ్‌బాల్ ఎంపికలు నిర్వహిస్తున్నట్లు స్టెప్ సీఈఓ సి. సాయిగ్రేస్, డీఎస్‌ఏ చీఫ్ కోచ్ ఎస్.వి.పి. అమృత్‌రాజ్ తెలిపారు. అండర్-17, అండర్-21 విభాగంలో నిర్వహించే ఈ ఎంపికలకు హాజరయ్యే క్రీడాకారులు రూ.100 ఎంట్రీఫీజు చెల్లించాల్సి ఉంటుందన్నారు. జిల్లా జట్టుకు ఎంపికయ్యే క్రీడాకారులు ఈనెల 29వ తేదీన బాపట్లలో నిర్వహించే శాప్‌లీగ్ రాష్ట్రస్థాయి షూటింగ్‌బాల్ పోటీల్లో పాల్గొనాల్సి ఉంటుందని తెలిపారు. పూర్తి వివరాలకు 9121106839, 6300664935 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

ఎంపీకి పోటీ చేసి
డిపాజిట్ కోల్పోయింది గుర్తు లేదా?

- ఏ పార్టీలో ఉంటే ఆ పార్టీకి మోసం చేసే నైజం నీది
- ముడుపులపై ప్రమాణానికి సిద్ధమా ?
- డీఎల్‌కు సవాల్ విసిరిన ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రఘురామిరెడ్డి

మైదుకూరు : కడప పార్లమెంట్ ఉప ఎన్నికలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై పోటీ చేసి డిపాజిట్ కోల్పోయిన విషయం డీఎల్ రవీంద్రారెడ్డికి గుర్తు లేదా అని ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి ప్రశ్నించారు. వైఎస్సార్‌సీపీని భూ స్థాపితం చేస్తానని డీఎల్ వ్యాఖ్యానించడంపై సోమవారం ఎమ్మెల్యే విలేకరులతో మాట్లాడారు. పార్లమెంట్ ఉప ఎన్నికలో వైఎస్ జగన్‌కు 6.90లక్షల ఓట్లు రాగా కేవలం లక్షా 46 వేల ఓట్లు పొంది డిపాజిట్ కోల్పోయిన డీఎల్ వైఎస్సార్‌సీపీని భూస్థాపితం చేస్తాననడం హాస్యాస్పదంగా ఉందని అన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో తన సొంత గ్రామం సుంకేసుల సర్పంచ్, ఎంపీటీసీ పదవుల్లో తన అనచరులు ఓడిపోయారన్నారు.

మోసం చేసే నైజం నీది

ఏ పార్టీలో ఉంటే ఆ పార్టీని మోసం చేసే నైజం డీఎల్‌ది అని ఎమ్మెల్యే రఘురామిరెడ్డి ఆరోపించారు. తాజాగా సుధాకర్ యాదవ్ తాను ఒక్కటే అంటున్నాడు, మళ్లీ టికెట్ నాకంటే నాకంటూ ప్రకటనలిస్తున్నారని ఎద్దేవా చేశారు. ఇద్దరూ ఒక్కటైనా ఏమీ చేయలేరన్నారు. 2014లో ఇద్దరూ కలిసి ఉన్నారుగా.. ఏం చేశారని అన్నారు.

ముడుపులపై ప్రమాణానికి సిద్ధమా?

మైదుకూరులోని బార్ నిర్వాహకుల నుంచి తనకు ముడుపులు అందినట్లు డీఎల్ చేసిన ఆరోపణలను ఎమ్మెల్యే ఖండించారు. బార్ నిర్వహణ ఓపెన్ టెండర్.. ఎవరైనా వేయవచ్చని తెలిపారు. జెడ్పీటీసీ భర్త ఏవీ సుబ్బారెడ్డి టెండర్ దక్కించుకోగా ఎస్ఎల్‌వీ వాళ్లు నిర్వహిస్తున్నారని వివరించారు. టెండర్‌దారు కానీ, నిర్వహిస్తున్న వాళ్లు కానీ తనకు ముడుపులు ఇచ్చినట్టు చెప్పమనండి ఆ క్షణమే తాను ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేస్తానని స్పష్టం చేశారు. ప్రొద్దుటూరులోని ఆయిల్ మిల్ యజమాని రామాంజనేయుల రెడ్డి మైదుకూరులో భూమి కొనుగోలు చేస్తే, బెదిరించి అతని వద్ద రూ.25 లక్షలు తీసుకున్నాడని డీఎల్‌పై బాధితుడు బహిరంగంగా చెప్పాడన్నారు. ఆ విషయంలో కాణిపాకంలో ప్రమాణం చేయాల్సిందిగా రామాంజనేయులరెడ్డి సవాల్ విసిరాడని తెలిపారు. డీఎల్‌కు దమ్ము, ధైర్యం ఉంటే కాణిపాకం వెళ్లి రామాంజనేయులరెడ్డి వద్ద డబ్బు తీసుకోలేదని ప్రమాణం చేయాలన్నారు. అలా చేస్తే తాను బార్ విషయంలో ముడుపులు తీసుకోలేదని మాధవరాయస్వామి ఆలయంలో ప్రమాణం చేస్తానన్నారు. లేదంటే డీఎల్ తేదీ, రోజు చెబితే ఇద్దరం ఒకే సారి మాధవరాయ స్వామి ఆలయంలో ప్రమాణం చేసేందుకు తాను సిద్ధమన్నారు. ఏదో ఒకటి మాట్లాడుతుంటే ఎవడో తలమాసినోడు ప్యాకేజి ఇస్తాడనే ఆశతోనే డీఎల్ దిగజారి మాట్లాడుతున్నాడని ధ్వజమెత్తారు. సమావేశంలో వ్యవసాయ సలహాదారు ఇరగంరెడ్డి తిరుపాల్‌రెడ్డి, రాష్ట్ర ఐబీసీ డైరెక్టర్ డి.గంగాధర్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ మాచనూరు చంద్ర, వైస్ ఎంపీపీ ఊటుకూరు రఘురామిరెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ గల్లా నరసింహారెడ్డి పాల్గొన్నారు.